క్లుప్తంగా

ద్రోణాదులలో సీతారామ కల్యాణం రేపు

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల షిరిడీ సాయి బాబా మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా ఆరో తేదీ సీతారామ కళ్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చిన్నం చంద్రశేఖర్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. 108 జంటల దంపతుల సమక్షంలో 108 లీటర్ల ఆవుపాలతో ప్రత్యేక పూజలతో షిరిడీ హారతులు, అభిషేకాల నిర్వహణ అనంతరం సీతారామ కళ్యాణం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయి మందిరం 35వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

నేడు బాబు జగజ్జీవన్‌రాం జయంతి

చీరాల: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 9గంటలకు ముక్కోణం పార్కు సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని క్యాంపు కార్యాలయ ప్రతినిధి శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్‌గా రమేష్


రమేష్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండల మార్కెట్ యార్డు చైర్మన్‌గా తేలప్రోలు రమేష్ శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

చీరాల ఏఎంసీ చైర్మన్‌గా జనార్దన్


కొతరపు జనార్దన్

చీరాల: చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వేటపాలెం మండలం కొత్తపేటకు చెందిన కొతరపు జనార్దన్ నియమితులయ్యారు. శుక్రవారం ఏఎంసీ చైర్మన్ల జాబితా విడుదల చేశారు. గతంలో ఆయన కొత్తపేట పంచాయతీ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. చేనేత సీనియర్ నాయకులు పేరున్న కొతరపు జనార్దన్ ఏఎంసీ చైర్మన్ నియమించడం పట్ల చేనేత నాయకులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

సమన్వయంతోనే హెచ్‌ఐవీ నియంత్రణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

అద్దంకి: కేంద్ర ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే హెచ్‌ఐవీ నియంత్రణలోకి వస్తుందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ఆయన హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. మేదరమెట్ల ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి వెండి గొడుగు, మకర తోరణం

పొదిలి: స్థానిక విశ్వనాథపురం కాలేజీ రోడ్డులో సీతారామచంద్ర స్వామి ఆలయానికి దాతలు మకరణ తోరణం, వెండి గొడుగు తయారు చేయించారు. ఆలయ ధర్మకర్త పోలిరెడ్డి ఆధ్వర్యంలో మకర తోరణం, వెండి గొడుగును దాతల గృహాల నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. మేళ తాళాలు, వేద మంత్రాల నడుమ స్వామి వారికి అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో సామి రాజా, సుబ్రమణ్యం(శివ), కోటేశ్వరరావు, సూరి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మార్కాపురం టౌన్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ సంఘటన మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై రాజమోహన్‌రావు కథనం మేరకు.. కొండేపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న మల్లా శ్రీనివాసులు స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద హోటల్ నిర్వహిస్తుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లిన ఆయన సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో దాచి ఉంచిన రూ.35 వేల విలువైన బంగారు ఆభరణాలు, రూ.7 వేల నగదు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముంజల్.. చిల్.. చిల్

- వేసవి తాపానికి అద్భుత ఔషధం తాటిముంజలు
- ఆరోగ్యం పంచుతూ ఆదాయం పొందుతున్న చీరాల మండలంలోని రైతు కూలీలు

చీరాల టౌన్: ఎండలు నెమ్మదిగా పెరిగిపోతున్నాయి. చీరాల నియోజకవర్గంలో ఏప్రిల్ మాసానికి గాను ఇప్పటికే రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. మండు వేసవిలో శీతల పానీయాలు, కొబ్బరి బోండాలు వంటివి పేదలకు ఏమాత్రం అందుబాటులో ఉండవు. అందుకే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు వేసవి తాపాన్ని తగ్గించే.. అతి తక్కువ ధరకు దొరికే తాటిముంజలకు ఈ ప్రాంతంలో గిరాకీ ఎక్కువ. వేసవి సెలవుల్లో పొలం గట్లపై తాటిచెట్ల నుంచి తాటికాయలు కోసుకుని తినడం రివాజు. అందుకే ఇక్కడ ఉండే రైతు కూలీలు కొందరు తాటిముంజల అమ్మకాలను ఆదాయ వనరుగా ఎంచుకొని లాభసాటి వ్యాపారంగా మార్చుకుంటున్నారు. చీరాల పట్టణంలోని పలు కూడళ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రధాన కూడళ్లలో విరివిగా లభిస్తున్నాయి.

వేసవిలో పనులు చేయలేక..

వేసవికాలం కావడంతో కూలి పనులకు వెళ్ళలేక తాటి ముంజల వ్యాపారం చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తెచ్చిన ముంజలను పట్టణంలోని ప్రధాన కూడళ్ళ వద్ద జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. మసీదు సెంటర్, గడియార స్తంభం సెంటర్, కారంచేడు గేటు, వైకుంఠపురం రైల్వేగేటు, కారంచేడు రైల్వేగేటు, దేవాంగపురి, ఈపురుపాలెం, పేరాల, ఐఎల్‌టీడీ కంపెనీ వద్ద, మసీదు సెంటర్ ప్రాంతాల్లో వాటిని అమ్ముతున్నారు. వేసవిలో రెండు నెలల పాటు ఇదే వ్యాపారంగా చేసుకొని కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఉపాధి పొందుతున్నామని వారు చెబుతున్నారు. డజను మంజలు సైజును బట్టి రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎటువంటి నీడ లేకుండా ఎండలోనే అమ్మకాలు సాగిస్తున్నారు.


తాటికాయల నుంచి ముంజలు తీస్తున్న వ్యాపారి

చెట్టు లెక్కన కొనుగోలు

ఏప్రిల్, మే నెలల్లో తాటిముంజలు సమృద్ధిగా లభిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో పొలాల్లో ఉన్న తాటిచెట్లను రైతుల వద్ద నుంచి చెట్టు లెక్కన కొనుగోలు చేస్తారు. వేసవి సీజన్‌లో మాత్రమే దిగుబడి ఉండే కాయలు పూర్తిగా తయారైన తర్వాత కిందకు దించి గెలలుగా విక్రయిస్తారు. వీటిని కాయలుగా పట్టణ ప్రాంతాలకు తీసుకువచ్చి తాటిముంజలను అమ్ముతున్నారు.

ప్రభుత్వ విద్యకు ప్రోత్సాహం


నోట్ పుస్తకాలను అందిస్తున్న డీఐఈఓ యర్రయ్య

చీరాల అర్బన్: ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇచ్చి అందించే అన్ని సౌకర్యాలను విద్యార్థినులు అందిపుచ్చుకోవాలని జిల్లా డీఐఈఓ పి.యర్రయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్. స్నేహలత మాట్లాడుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినులకు ఈనెల 1 నుంచి తరగతులు జరుగుతున్నాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో, సువిశాల ప్రాంగణంలో అన్ని వసతులున్నాయన్నారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు.

రీ సర్వేతో సమస్యల పరిష్కారం



గొర్రెపాడులో రీసర్వేపై ర్యాలీ


కారంచేడులో సభలో మాట్లాడుతున్న డీటీ అనిత

బల్లికురవ: రీసర్వేతో గ్రామాల్లో సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని భూసమస్యలకు హద్దులు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ రవినాయక్ అన్నారు. శుక్రవారం రెండోఫేజ్‌లో ఎంపికైన గొర్రెపాడు, కొప్పరపాలెం గ్రామాల్లో అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. సర్వే డీటీ ప్రహర్ష, రెవెన్యూ సిబ్బంది, గొర్రెపాడు సర్పంచ్ యం. చిన దానయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కారంచేడు: సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం ఈ రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని డీటీ అనిత అన్నారు. శుక్రవారం కారంచేడు గ్రామ పంచాయితీ కార్యలయం వద్ద గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడారు. మండల సర్వేయర్ సత్యన్నారాయణ, సర్వే సిబ్బంది, పంచాయితీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వంశీ కుటుంబ సభ్యులకు పరామర్శ


వంశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గాదె మధూసూదన రెడ్డి, నాయకులు

పర్చూరు(చినగంజాం): వాడరేవులో సముద్ర స్నానానికి వెళ్ళి ఇటీవల సముద్రంలో మునిగి చనిపోయిన పర్చూరు నెహ్రూ కాలనీకి చెందిన చుక్కా వంశీ కుటుంబ సభ్యులను పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతుని ఇంటి వద్దకు వెళ్ళి అతని తండ్రి శామ్యూల్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అదే విధంగా చెరుకూరు గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాలేషవలి తండ్రి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వైస్ ప్రెసిడెంట్ తులసి రాజా సతీమణి తులసి వాణి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, నాయకులు కోట శ్రీనివాసరావు, గేరా స్వరాజ్ కుమార్, ఎంపీటీసీ వీరయ్య, వైస్ ప్రెసిడెంట్ గోపి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్డుదారులతో ఈకేవైసీ చేయించాలి

వేటపాలెం: ఈకేవైసీ చేయించిన కార్డు దారుల చేత డీలర్లు తప్పని సరిగా త్వరగా ఈకేవైసీ పూర్తి చేయించాలని ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ గీత ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్సుతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. త్వరగా ఈకేవైసీ పూర్తి చేసే బాధ్యత రేషన్ డీలర్స్ తీసుకోవాలన్నారు. ఈకేవైసీ లేని వారిని గుర్తించి వారికి సమాచారం అందించాలని కోరారు. దూర ప్రాంతాల్లో ఉండేవారు అక్కడ నుంచే మీసేవా కేంద్రాల ద్వారా ఈకేవైసీ చేయించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించండి


ఈర్లగంగమ్మ తిరునాళ్లకు సంబంధించి ఎస్సైకి సూచనలు ఇస్తున్న సీఐ

బల్లికురవ: ఈర్లగంగమ్మ తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసేందుకు రాజకీయపార్టీలు భక్తులు సహకరించాలని సంతమాగులూరు సీఐ వెంకటరావు కోరారు. ఈ నెల 12న జరిగే బల్లికురవ సమీపంలోని ఈర్లగంగమ్మ తిరునాళ్లకు సంబంధించి శుక్రవారం సాయంత్రం ఆలయాన్ని ప్రభలు ఏర్పాటు చేసే ప్రదేశాన్ని వసతులను సీఐ పరిశీలించారు. ట్రాఫిక్‌కు బల్లికురవ- సంతమాగులూరు రోడ్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తోపులాట జరగకుండా ఆలయ ముందు భాగంలో బారికేట్లు ఏర్పాట్లు చేయాలని వాహనాల పార్కింగ్‌లను ఆలయానికి దూరంగా ఏర్పాటు చేయాలని బల్లికురవ ఎస్సై జీవీ చౌదరికి సూచించారు.

ప్రభుత్వ స్థలాల్లోని వారికి పట్టాలు

యద్దనపూడి: ప్రభుత్వ స్థలంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పట్టాలు కావాలనుకునే వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019 అక్టోబర్ 15 నాటికి బీపీఎల్‌కు దిగువన ఉన్న కుటుంబాలు అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించే విషయంలో జీఓ నెంబర్ 30 ను విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం ఏళ్ల తరబడి ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న కుటుంబాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి అధికారికంగా కన్వేయన్స్ డీడ్ మంజూరుకు ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. దీనికి వార్షిక ఆదాయం 1.20 లక్షలు మించి ఉండకూడదని, వ్యవసాయ భూమి 10 ఎకరాల్లోపు మాత్రమే ఉండాలని, ఆదాయం పన్ను చెల్లింపుదారులకు ఈ పథకం వర్తించదని తెలిపారు. సచివాలయాల్లో ఆధార్‌కార్డు, కరెంట్‌బిల్లు, రేషన్‌కార్డు, జెరాక్స్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు నిర్మాణం ఆపాలంటూ ఫిర్యాదు


అంబేడ్కర్ నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం

పర్చూరు(చినగంజాం): పర్చూరు అంబేడ్కర్ సెంటర్‌లోని రెండు సెంట్ల స్థలంలో పంచాయతీ వారు నిర్మించ తలపెట్టిన రోడ్డు నిర్మాణాన్ని వెంటనే ఆపాలని ఆ స్థల యజమాని మల్లంపాటి కల్పనాదేవి పర్చూరు కార్యదర్శికి శుక్రవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. సీసీ రోడ్డు తలపెట్టిన బజారులో సర్వే నిర్వహించకుండా తమ స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. బజారుని సర్వే చేసిన అనంతరం మాత్రమే సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు, బ్యాంకర్లు

యద్దనపూడి: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఓబీఎమ్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బ్యాంకు అధికారులు, ఎంపీడీఓ కృష్ణ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తంగా 36 మంది దరఖాస్తు చేసుకోగా 34 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. బీసీవెనుకబడిన తరగతులకు సంబంధించి 16 మందికి రూ.31 లక్షలు, ఈడబ్ల్యూఎస్ కింద కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, 8 మందికి గానూ రూ.14 లక్షలు మంజూరు చేస్తామన్నారు.

సంఘ బలోపేతానికి చర్యలు


సంఘ నూతన కార్యవర్గం

అద్దంకి: విశ్వబ్రాహ్మణ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘ బాపట్ల జిల్లా అధ్యక్షుడు కొండపర్తి రాజశేఖర్ అన్నారు. అడితీ రామారావు భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘీయుల అభివృద్ధే అజెండగా పనిచేయాలని చెప్పారు. జిల్లా విశ్వకర్మ ప్రధాన కార్యదర్శిగా ఆళ్లగడ్డ వీరసుందరాచారి, గౌరవ సలహాదారుగా గొల్లపాటి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షునిగా కొండముది రమేశ్‌బాబు, కార్యదర్శిగా గుండెమెడ వెంకటేశ్వర్లు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షునిగా కొండముది బంగారుబాబును నియమించడం పట్ల అభినందనలు తెలియజేశారు.

అర్జీల విచారణ వేగవంతం కావాలి

చీరాల టౌన్:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న అర్జీల స్వీకరణ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కె.గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లు చేయాలన్నారు. డీటీ డి.అర్జున్, వీఆర్వోలున్నారు.

నివేశన స్థలాలు కేటాయించాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద జీడిపప్పు కార్మికులు

వేటపాలెం: అర్హులైన పేదలకు నివేసన స్థలాలు కేటాయించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. పూరి గుడిసెలు, అద్దె ఇళ్లల్లో జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వోదయ కాలనీ, ఇందిరా కాలనీ ప్రాంతాల్లో తరతరాలుగా జీడీబట్టీ కార్మికులుగా జీవిస్తున్న కార్మికులు ఇల్లు లేకుండా ఉన్నారని తెలిపారు. చాలామందికి ఆధార్ కార్డులు లేవన్నారు. వీరందరినీ గుర్తించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హత సాధించే విధంగా అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు మచ్చా అయ్యప్ప రెడ్డి, లక్ష్మీ శ్రావణి రమణమ్మ, బుల్లయ్య తదితరలు పాల్గొన్నారు.

120 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అద్దంకి: దస్తగిరిగారి వెన్నెల నేత్రాలయ వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పూర్ణిమ బృందం పరీక్షలు చేశారు. 50 మందికి నేత్ర, శస్త్ర చికిత్సలు అవసరం అని గుర్తించారు. రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చందూరి మురళీ సుధాకర్‌రావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహ్మర్ రఫీ, చిన్న మురళి కృష్ణ, పసుపులేటి అంజనేయులు, డాక్టర్ యు. దేవపాలన, విద్వాన్‌జ్యోతి చంద్రమౌళి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేతి రాత పోటీలు


చేతి రాత పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకి రూరల్: జీఎస్ఆర్ హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కాకాని పాలెంలోని ఎలిమెంటరీ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు చేతి రాత పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

చీరాల రూరల్: భీమవరం కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న బంటుమిల్లి కృష్ణ అనే న్యాయవాదిపై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపరచిన సంఘటనను నిరసిస్తు శుక్రవారం చీరాల న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా పట్టాభి రామస్వామి ప్రతిష్ట మహోత్సవం


పూజల్లో పాల్గొన్న అన్నా రాంబాబు

– మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు హాజరు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని రామాంజనేయ నగర్‌లో పట్టాభి రామస్వామి దేవస్థానంలో శుక్రవారం గణపతి సహిత సీతా లక్ష్మణ రామచంద్రుడి విగ్రహాల ప్రతిష్ట, నూతన ధ్వజ స్తంభం, మహా కుంభాభిషేక ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల్లో మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి పూజలు చేయించారు. అనంతరం అన్నా రాంబాబును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, బార్ అసోషియేషన్ అధ్యక్షులు భూపని కాశయ్య, శివరాంపురం సర్పంచ్ బ్రహ్మం పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాద గుమస్తాల కార్యవర్గం ఎన్నిక

అద్దంకి: పట్టణ న్యాయవాద గుమస్తాల కార్యవర్గ ఎన్నిక సమావేశం శుక్రవారం కోర్టు భవన సముదాయంలో నిర్వహించారు. సమావేశంలో న్యాయవాద గుమస్తాల సంఘ కంకణాల ప్రియతమ్, వైస్ ప్రెసిడెంట్‌గా విప్పర్ల శ్రీనివాసరావు, సెక్రటరీగా ఉసురుపాటి అనిల్‌ను ఏకగ్రీవగా ఎన్నుకున్నారు. న్యాయనిర్ణేతగా పంచాగ్నుల రమేశ్ వ్యవహరించారు.

పంచాయతీల్లో సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయితీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయితీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిశితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ఈఓఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.